# సినీ బేతాళ కథలు





- డా. కె.వివేకానందమూర్తి

*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

## - 45 -

## - చిత్రగ్రహణం -

**విసుగు చెంతకు** రానీయని విక్రమార్కుడు బేతాళుడి శవాన్ని మళ్లీ తన భుజంమీద వేసుకుని నడకసాగించాడు.

'విక్రాణ దారిలో నీకు శ్రమ తెలియకుండా వుండేందుకు మరో కథ చెబుతాను విను' అని బేతాళుడు ప్రారంభించాడు.

-"నిర్మాత విజయపతికి ఎనభై యేళ్లు వచ్చేసాయి. ఎన్నో చిత్రాలు తీసాడు. అన్నీ బాగా ఆడాయి. అతనింకా చిత్రాలు నిర్మిస్తూనే వున్నాడు. విజయపతి చిత్ర పరంపరకి మరే చిత్రం దీటుగా నిలిచి పోటీ కాలేకపోతోంది. మిగతా చిత్రాల్లో నవరసాభాసలు అనూహ్యంగా గుప్పిస్తున్నారు. హీరోలు గంతులు వేస్తున్నారు. విలన్ మూకల్ని కొడుతూ గంతులు వేయిస్తున్నారు. రైటర్స్ డైలాగుల్ని యిరగదీస్తున్నారు. అంతా వొకే కథకు ఫిక్సయిపోతున్నారు. ప్రేక్షకులు సభ్యతగా హీరోయిన్స్ వొళ్లు చూడ్డం మానేసి వారు పైనా కిందా ధరించే కాసిని బట్టల్నే చూస్తున్నారు. అయినా ఆ చిత్రాలు అంతగా ఆడడం లేదు. విజయపతి చిత్రాలు వీరవిహారం చేస్తున్నాయి.

జర్నలిస్టులకి విజయపతి విజయరహస్యం ఏవిటో విశదం కావడంలేదు. అంతా వొకరోజు వెళ్లి ఆ నిర్మాతను కలిసి అడిగారు - 'అయ్యా! ఆట విడుపులేని తమ చిత్ర విజయాలకు ఆయువుపట్టు తెలుసుకోవాలని మాకెంతో కుతూహలంగా వుంది. మీరు కాస్త వివరిస్తే యిండస్ట్రీలో యితర నిర్మాతలు కూడా బతికి హీరోయిన్స్‌కి బట్టకడతారు'

బదులుగా నిర్మాత విజయపతి '- తప్పక చెబుతాను బాబూ! నలుగురికీ పనికి రావడంకంటే గొప్ప విజయం వేరే యేముంటుంది అమ్మా!' అని ఆడామగా జర్నలిస్టుల్ని వుద్దేశిస్తూ చెప్పాడు -' మంచి విజయవంతమైన చిత్రం తీయాలంటే తీసేవాడికి మంచి ఆరోగ్యం ముఖ్యం. నన్ను చూడండి - ఎనభై యేళ్లు నాకు. ఏ రోగంలేదు.'

'తమ ఆరోగ్య రహస్యం యేవిటో?' - ఒకరడిగారు.

'ఇందులో రహస్యం యేవీలేదు. సమయానికి సరైన ద్రవం తాగితే యే వుపద్రవం రాదు.'

'అంటే?'

'అంటే - ఏవీ లేద్రా! వొళ్లు అలసట అనిపిస్తే విస్కీ తాగుతాను. బద్ధకం వొదలకపోతే బ్రాందీ తాగుతాను. మధుమేహం రాకుండా మరచెంబుడు మార్టినీ, బ్లడ్‌ప్రెషరు పెరగకుండా బ్లడీ కలరువైనూ, వోపిక పెరగడానికి వోడ్కా, యిలా సందర్భోచితంగా సదరు ద్రవాల్ని సేవిస్తాను.'

'మరి నీళ్లెప్పుడు త్రాగెదరు మహా పతీ?'

'ఆ దిక్కుమాలిన నీళ్లు తాగాల్సినంత సుస్తీ నాకెప్పుడూ చెయ్యలేదు పిల్లలూ'

'మరయితే మీ తదుపరి చిత్రం యెంత వరకూ వచ్చింది సార్!'

– 'అదుగో అక్కడ ఆఫీసు రూమ్‌లో నా దర్శకుడు, సహదేవరావున్నాడు. అతన్ని వెళ్లి అడగండి.'

'సహదేవరావా?'

'అవున్నాయనా, సహదేవుడే – పాండవుల్లో సహదేవుడు చినుక్కీ చినుక్కీ మధ్య నుంచి దూసుకుపోయేలా బాణాలు వేసేవాడుట. మా దర్శక సహదేవుడు కూడా అంతే – యమా పెర్ఫెక్షనిస్టు – వెళ్లి కలవండి' అని జర్నలిస్టుల్ని పంపించాడు నిర్మాత విజయపతి.

జర్నలిస్టులంతా వెళ్లి దర్శకుడు సహదేవరావుని కలిసి, అడిగారు – 'అయ్యా! సహదేవా! తమ తదుపరి చిత్రం యెంతవరకూ వచ్చింది?' అని.

'మా నెక్స్ట్ పిక్చరా! కంప్లీట్ అయిపోయిందిగా. ఆల్‌రెడీ!'

'కంప్లీట్ అయిపోయిందా – యెప్పుడు సార్. ఎక్కడా ఏ సందడీ లేదు అసలు షూటింగ్ జరిగిన సమాచారమే మాకు తెలియదు?'

'అదే పిక్చరంతా కంప్లీట్. జస్ట్ షూటింగ్ వొక్కటే మిగిలి వుంది.'

'అదేవిటి సార్? షూటింగ్ జరగకుండా సినిమా కంప్లీట్ అవడం యేవిటి? ఇది మేం యెక్కడా వినలేదు సార్' అని జర్నలిస్టులంతా ఆశ్చర్యపడిపోయి మళ్లీ లేవలేదు. దర్శకుడు సహదేవరావు వారిని లేవదీసి విశదీకరించే ప్రయత్నం కూడా చెయ్యలేదు.

– అదీ విక్రమార్కా! ఇప్పుడు చెప్పు దర్శకుడు సహదేవశర్మ షూటింగ్ చెయ్యకుండా, పిక్చరంతా కంప్లీట్ అయిపోయింది. జస్ట్ షూటింగ్ మాత్రమే చెయ్యాలి' అని కన్ఫ్యూజింగ్ స్టేట్‌మెట్ ఎందుకు యిచ్చాడు? – నా యీ ప్రశ్నకు నువ్వు తెలిసీ సమాధానం చెప్పక పోయావో, నీ తల వెయ్యి ప్రెగ్గులయి నిర్మాత విజయపతి గొంతుపాలయిపోతుంది" అని ముగించాడు బేతాళుడు.

బదులుగా విక్రమార్కుడు, "ఓ! బేతాళా! ఇందులో కన్ఫ్యూజన్ ఏవీ లేదు. దర్శకుడు సహదేవరావు సామాన్యుడు కాదు. అంతర్జాతీయ దర్శక నిర్మాత ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్ అంత మాన్యుడు. అన్నీ అద్భుత విజయాలైన థ్రిల్లర్స్ తీసిన హిచ్‌కాక్, ఎవరేనా ' మీ పిక్చర్ యెంతవరకూ వచ్చింది?' అని అడిగితే సరిగ్గా యిదే సమాధానం – ఆల్ ఫినిష్డ్ – జస్ట్ షూటింగ్ బిట్ – అని చెప్పేవాడు. మన సహదేవరావు కూడా అలాగే 'చిత్రం అంతా పూర్తయిపోయింది. షూటింగ్ వొక్కటే మిగిలుంది.' అని చెప్పాడు. అందుకే అతను, నిర్మాత విజయపతికి తీసిపెట్టిన చిత్రాలన్నీ ఘనవిజయాలు సాధిస్తున్నాయి. కథ యెంపిక, తీసే విధానం సెకండ్ సెకండ్‌కీ కచ్చితంగా ముందే రూపు దిద్దుకుంటే తరవాతి షూటింగ్ నల్లేరు నడక గ్రౌండ్ వర్క్ బలంగా నిశ్చితంగా కచ్చింతగా లేకపోతే, యెంతటి ఆకాశహర్మ్యమైనా కూలిపోక తప్పదు.

**జ్ఞానం కర్మచకర్తా చ**
**త్రిధైవ గుణ భేదతః!**
**ప్రోచ్యతే గుణ సఙ్ఖ్యానే**
**యథావచ్ఛృణు తాన్యపి ||**

చేయదగిన కర్మజ్ఞానము, చేయవలసిన కర్మ, దానిని చేయుకర్తయున్ను ఒక్కొక్కటి సత్వాది గుణభేదములచే మూడు విధాలు. ఈ గుణాలచే భేదించు జ్ఞానాదులను తెలియదగిన రీతిగా తెలుసుకొనుము -

అన్నారోయ్ గీతాచార్యులు శ్రీకృష్ణభగవానుడు -" అని బదులు చెప్పగానే, రాజుకి మౌనభంగం కలిగి, బేతాళుడు యెగిరేముందు తన ఎక్విప్‌మెంట్ సర్దుకుని, యెగిరి వెళ్లి మళ్లీ చెట్టెక్కేసాడు.

***(వచ్చేనెలలో మరోకథ)***

Post your comments